# మూగబోయిన దివ్యాంగుల హక్కుల గొంతుక




## నల్లెల రాజయ్య అకాల మరణం

### నివాళులర్పించిన వివిధ సంఘాల ప్రతినిధులు

సమస్యలున్నకాడ
ఆ హృదయం స్పందిస్తుంది
ప్రశ్నించే గొంతుక అవుతుంది
నలుగురితో నిలబడుతుంది
జైనుల పునాదులు అగ్గిలయ్య గుట్ట
రక్షణ కవచమయ్యింది
పద్మాక్షి గుండం కలుషితాన్ని ఆపింది
చెత్తరోడ్లు, ప్రభుత్వ భూముల కబ్జాపై
ఉద్యమించే పౌరస్పందన వేదికైంది

ఇప్పుడు ఆ గుండెశబ్దం
ఆగిపోయింది
ఉద్యమ గొంతుక మూగబోయింది
మలిదశ తెలంగాణ ఉద్యమం కోసం
ఎత్తిన
పిడికిలి రాసిన అక్షరాలు
ఉద్యమ స్ఫూర్తిని అందిస్తూనే
వుంటాయి
కన్నీటి నివాళులు రాజన్న


# వరంగల్ వాయిస్
Evening Daily
www.warangalvoice.net
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 205 | గురువారం | 15 ఫిబ్రవరి 2024 | పేజీలు : 08 | వెల రూ. 5





జాతరకు కట్టుదిట్టమైన బందోబస్తు
ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఎస్పీ శబరీష్
14 వేల పోలీసులతో పహారా
కీలక ఘట్టాలపై స్పెషల్ ఫోకస్
జాతర విజయవంతమే లక్ష్యంగా చర్యలు




# నిఘా నీడలో.. మేడారం

తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధిగాంచిన మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర పూర్తిగా పోలీసుల నిఘా నీడలోకి వచ్చింది. చీమ చిటుక్కుమన్నా పోలీసులకు తెలిసేలా 500 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ డాక్టర్ పి.శబరీష్ జాతరపై ప్రత్యేక దృష్టి సారించారు. నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ లోటుపాట్లను సరిదిద్దుతున్నారు. సమ్మక్క సారలమ్మ గద్దెలు, జంపన్న వాగు సమీపంలో పోలీసులు ప్రత్యేక క్యాంపులను ఏర్పాటు చేశారు. జాతరను విజయవంతం చేయడంలో పోలీస్ శాఖ కీలకంగా వ్యవహరించేలా ఆదేశాలిచ్చారు. కోట్లాది భక్తులు తరలివచ్చే ఈ జాతరలో పోలీస్ సిబ్బంది నిద్రాహారాలు మాని విధులు నిర్వర్తించేలా చర్యలు చేపట్టారు. కీలక ఘట్టాల్లో పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశాలు జారీ చేశారు. బందోబస్తు విషయంలో రాజీపడొద్దంటూ హెచ్చరికలు జారీ చేశారు. పూర్తిగా గిరిజన సంప్రదాయాలతో నిర్వహించనున్న ఈ జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు.

- వరంగల్ వాయిస్ ప్రత్యేక ప్రతినిధి






వివరాలు 2లో..




## జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు

పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

మేడారం ట్రస్ట్ బోర్డు నూతన కమిటీతో కలిసి వన దేవతల సందర్శన

## ట్రాఫిక్ అంతరాయం కలుగొద్దు

బల్దియా ఇంచార్జి కమిషనర్ రాధిక గుప్తా

పోలీస్, జీడబ్ల్యూఎంసీ అధికారులతో సమన్వయ సమావేశం




## కాశిబుగ్గలో విషాదం

# ఉరి వేసుకొని బాలుడి మృతి



నగరంలోని 19వ డివిజన్ కాశిబుగ్గ రాములవారి వీధిలో నివాసముంటున్న 13 సంవత్సరాల బాలుడు గురువారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. దీనిని గమనించిన కుటుంబ సభ్యులు, బంధువులు వెంటనే బాలుడిని వరంగల్ ఎంజీఎం హాస్పిటల్ కి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. అయితే విద్యార్థి మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. అయితే బాలుడు కాశిబుగ్గ గుడి సమీపంలోని ప్రైవేట్ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. కాగా బాలుడి మృతితో స్థానికంగా విషాద ఛాయలు అలుముకున్నాయి.

- వరంగల్ వాయిస్, కాశిబుగ్గ

# నిఘా నీడలో.. మేడారం



**జాతరకు కట్టుదిట్టమైన బందోబస్తు**
**ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఎస్పీ శబరీష్**
**14 వేల పోలీసులతో పహారా**
**కీలక ఘట్టాలపై స్పెషల్ ఫోకస్**

**వరంగల్ వాయిస్ ప్రత్యేక ప్రతినిధి :** ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా గుర్తింపు పొందిన మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు చుట్టుపక్కల రాష్ట్రాలతో పాటు దేశ, విదేశాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తుంటారు. ఈసారి సుమారు కోటిన్నర మంది భక్తులు తల్లుల దర్శనానికి వచ్చే అవకాశం ఉందని అంచనా. నాలుగు రోజుల పాటు కిక్కిరిసిపోయే ఈ జాతరలో పోలీస్ వ్యవస్థే అతి కీలకం. తల్లులను గద్దెలకు చేర్చడం నుంచి ప్రముఖులకు బందోబస్తు ఇవ్వడం, మేడారం తరలి వచ్చే భక్తుల వాహనాలకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చేయడం, జాతరలో రష్ ను కంట్రోల్ చేయడం, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చూడటం, దొంగతనాల నియంత్రణ ఇలా ప్రతి ఒక్కటి పోలీసుల సామర్థ్యంపైనే ఆధార పడి ఉంటుంది. అందుకే మేడారం మహాజాతరలో పోలీసు బలగాలే కీలకంగా వ్యవహరిస్తారు. ఈ మేరకు మేడారం సమ్మక్క%--%సారలమ్మ మహాజాతరలో పోలీస్ ఫోర్స్ రెడీ చేసినట్లు జిల్లా ఎస్పీ శబరీష్ తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టామన్నారు. భక్తుల కోసం జాతర పరిసరాల్లో 1500 ఎకరాల్లో 33 పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. దాదాపు 5 లక్షల వరకు వాహనాలు వస్తాయని అంచనా. ఈ సారి ఆర్టీసీ ఆరు వేల బస్సులను నడపాలని నిర్ణయించిది. 70 ఎకరాల్లో ప్రత్యేక ప్రయాణ ప్రాంగాణాన్ని ఏర్పాటు చేసింది.

## 14 వేల సిబ్బంది.. 500 సీసీ కెమెరాలు

భారీ ఎత్తున తరలివచ్చే భక్తుల క్రౌడ్ ను కంట్రోల్ చేయడం కత్తిమీద సాము లాంటిదే. ఈ నేపథ్యంలోనే భద్రతా పరమైన చర్యలతో పాటు జాతర క్రౌడ్ కంట్రోల్ కు పోలీసులు ఎక్కడికక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. జాతర పరిసరాల్లో మొత్తంగా 500కుపైగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు పోలీసు వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసి మేడారం జాతరను పర్యవేక్షిస్తామని ములుగు ఎస్పీ శబరీష్ ఇప్పటికే స్పష్టం చేశారు. జాతరలో ఏం కొంచెం నిర్లక్ష్యం వహించినా.. తీవ్ర ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుంది. దీంతో ప్రతిచోటా పోలీస్ నిఘా ఉండేలా జిల్లా ఎస్పీ శబరీష్ ఈసారి పెద్ద మొత్తంలో బలగాలను మోహరించారు. జాతర పూర్తయ్యే వరకు 14వేల మందితో భారీ బందోబస్తు నిర్వహించేందుకు సమాయత్తం అయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టారు.

## ప్రముఖుల రాకకు బందోబస్తు..

సమ్మక్క-సారలమ్మను దర్శించుకోవడానికి ఈసారి ప్రముఖుల ఎక్కువ సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డి జాతరకు వచ్చే అవకాశం ఉండటంతో జిల్లా ఎస్పీ శబరీష్ పోలీసు బందోబస్తు విషయంలో ప్రత్యేక దృష్టి సారించారు. జాతర సమయంలో రాష్ట్రంలోని అందరూ మంత్రులు ఇక్కడికి వచ్చే అవకాశం ఉంది. దాంతో పాటు సాధారణ భక్తులు, వీఐపీ, వీవీఐపీ దర్శనం కోసం వచ్చే భక్తులు కూడా పెద్ద సంఖ్యలో ఉండే ఛాన్స్ ఉంది. దీంతోనే ప్రముఖుల కోసం స్పెషల్ క్యూలైన్ ఏర్పాట్లు చేశారు.

## గట్టమ్మ దేవాలయం వద్ద ఏర్పాట్లు..

మేడారం వచ్చే భక్తులకు మొదట గట్టమ్మను దర్శించుకోవడం ఆనవాయతీగా వస్తోంది. అక్కడ ట్రాఫిక్ ఇబ్బందులు తతెత్తకుండా ఏర్పాట్లు చేశారు. అక్కడ పోలీస్ ఫోర్స్ పెట్టి గట్టమ్మను సులభంగా దర్శించుకునే విధంగా ఎస్పీ శబరీష్ చర్యలు తీసుకున్నారు.

## కీలక ఘట్టాల్లో ప్రత్యేక ఫోకస్..

మేడారం జాతరలో జరిగే ముఖ్యమైన ఘట్టాలపై జిల్లా ఎస్పీ శబరీష్ స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఈ నెల21న కన్నెపల్లిలో ఉదయమే రెండు మూడు గంటలపాటు సారలమ్మకు ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం అక్కడ నుంచి మేడారం తీసుకొస్తారు. గద్దెల నుంచి ఈ ప్రాంతం మూడు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. సారలమ్మ గద్దెకు చేరుకునే రోజే తండ్రి పగిడిద్దరాజు ప్రత్యక్షం అవుతాడు. సారలమ్మ భర్త గోవిందరాజును సైతం.. ఏటూరు నాగారం మండలం కొండాయి గ్రామం నుంచి తీసుకువస్తారు. గ్రామస్తులంతా గోవిందరాజును తీసుకుని ఊరేగింపుగా మేడారానికి వస్తారు. ఒకే రోజు సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులస్వామి గద్దెలపైకి చేరుకుంటారు. ఈ సమయంలో భక్తులు పెద్దఎత్తున తరలివస్తారు. వీరిని కంట్రోల్ చేయడం చాలా కష్టం. ఈ విషయంలో పోలీసులు ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. భారీగా వచ్చిన జనాలను కంట్రోల్ చేసేందకు కసరత్తు మొదలు పెట్టారు.

## సమ్మక్కకు గౌరవ వందనం..

చిలుకల గుట్ట నుంచి సమ్మక్కను తీసుకొచ్చే సమయంలో అధికార లాంఛనాలతో పోలీసుల తుపాకీ కాల్చి గౌరవ వందనం చేస్తారు. అయితే మేడారానికి ఈశాన్యంలో ఉన్న చిలకలగుట్టపై నారచెట్టుకింద కుంకుమ భరిణె రూపంలోని సమ్మక్క ఉంటుంది. ఫిబ్రవరి 22న కుంకుమ భరిణే రూపంలో ఉన్న సమ్మక్కను పూజారులు తీసుకొచ్చి గద్దెపై ప్రతిష్టిస్తారు. మేడారం జాతర మ్నొత్తానికి ఇదే కీలక ఘట్టం. ఈ తంతు తర్వాత ఉత్సవ మూర్తులంతా గద్దెలపై కొలువై మూడో రోజు భక్తులకు దర్శనం ఇస్తారు. 23న బక్తుల మొక్కుల చెల్లింపు కార్యక్రమం, జాతరలో చివరి రోజు ఫిబ్రవరి 24న దేవతలను మళ్లీ వనంలోకి పంపిస్తారు. దేవతలు వనప్రవేశం చేయడంతో.. మేడారం మహాజాతర పరిపూర్ణం అవుతుంది. ఈ కార్యక్రమాల్లో పోలీసులు కీలకంగా వ్యవహరిస్తారు.

## కృత్రిమ మేధతో రద్దీ నియంత్రణ ..



రద్దీ నియంత్రణకు జిల్లా ఎస్పీ శబరీష్ కృత్రిమ మేధను ఉపయోగించుకోనున్నారు. ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఈ ప్రత్యేకమైన సాఫ్ట్ వేర్ ను కెమెరాల్లో ఇన్ స్టాలేషన్ చేసి అమర్చి వాటిని కమాండ్ కంట్రోల్ రూంకు అనుసంధానం చేస్తారు. చదరపు మీటరులో నలుగురు కంటే ఎక్కువగా ఉంటే కంట్రోల్ రూమ్ నుంచి సిబ్బందిని అప్రమత్తం చేసి అక్కడ రద్దీని నియంత్రిస్తారు. అలాగే క్రౌడ్ కౌంటింగ్ కెమెరాలు అమర్చి ఎంత మంది భక్తులు అమ్మవార్లను దర్శించకున్నారో తెలుసుకోనున్నారు.

## డ్రోన్ కెమెరాలు, ప్రత్యేక గైడ్ యాప్..



గగనతలం నుంచి జాతరలో శాంతి భద్రతలను పర్యవేక్షించేందుకు డ్రోన్ కెమెరాలను వినియోగిస్తున్నారు. ఇప్పటికే కొన్ని డ్రోన్ కెమెరాలను అందుబాటులోకి తెచ్చారు. వాటిని ప్రత్యేక సిబ్బందితో ఎగురవేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. మేడారం జాతర గైడ్ యాప్ ను కూడా అందుబాటులోకి తేనున్నారు. జాతరకు సంబంధించిన వివరాలు పార్కింగ్ స్థలాలు, మరుగుదొడ్లు, తాగునీరు, వైద్య శిబిరాలు, స్నానఘట్టాలు, ఆర్టీసీ బస్టాండ్, వసతులు ఎక్కడెక్కడ ఉన్నాయి.? అక్కడికి ఎలా చేరుకోవాలి.? రూట్ వివరాలు, హెల్ప్ లైన్, ట్రాఫిక్, తదితర సమాచారం ఉంటుంది. పోలీసు శాఖ జాతర విజయవంతానికి సాంకేతికను వాడుకుంటున్నారు.

## ప్రత్యక్ష ప్రసారం..

మేడారం జాతర వివరాలను ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు ఏర్పాటు చేయనున్నారు. భారీ ఎల్ ఈడీ తెరలను ఏర్పాటు చేసి జాతర విశేషాలను ఎప్పటి కప్పుడు ప్రసారం చేస్తున్నారు. జాతర సమయంలో విపరీతమైన రద్దీతో చిన్నపిల్లలు, వృద్ధులు తప్పిపోతే వారి ఫొటోలను కూడా ఈ తెరపై ప్రసారం చేసేందుకు తగిన ఏర్పాట్లు చేశారు.



## జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు

**వరంగల్ వాయిస్, ములుగు :** మేడారం మహా జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ తెలిపారు. మేడారం ట్రస్ట్ బోర్డు నూతన కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు రాష్ట్ర ప్రభుత్వం చేసిందన్నారు. జాతర సమీపిస్తున్న నేపథ్యంలో మా అధికారులు అన్ని విధాలుగా సిద్దంగా ఉన్నారన్నారు. నూతన కమిటీ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన ఆర్రెం లచ్చు పటేల్ తో పాటు డైరెక్టర్లకు శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధ బోయిన జగ్గారావుతో పాటు జిల్లా అధ్యక్షులు



పైడాకుల అశోక్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా బ్లాక్ మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భారత్ బంద్‌ను విజయవంతం చేయండి




**వరంగల్ వాయిస్, నెల్లికుదురు :** మండల కేంద్రంలో స్థానిక విశ్రాంతి భవనంలో రేపు జరగబోయే గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు వారిపల్లి వెంకన్న, సీఐటీయూ మండల కార్యదర్శి ఇసుంపల్లి సైదులు కోరారు. గురువారం వాల్ పోస్టర్ ఆవిష్కరణ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకంగా భారత్ బంద్ ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ బంద్ ను వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిచ తలపెట్టినట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్కీం వర్కర్లను పర్మినెంట్ చేయాలని, కాంట్రాక్టు పద్ధతిలో చేస్తున్న ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగుల గుర్తించాలని, కనీస వేతనం రూ.26000 ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు కోడ్ లను రద్దు చేయాలని, వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర ప్రకటించాలని, ఔట్ సోర్సింగ్ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ గ్రామీణ ప్రాంతాలు పనిచేస్తున్న అంగన్వాడి, ఆశా, గ్రామపంచాయతీ మధ్యాహ్న భోజన కార్మికులు, పాఠశాలలో పరిశుభ్రత కోసం పనిచేస్తున్న స్కావెంజర్లను తిరిగి నియామకాలు చేపట్టాలని, తదితర డిమాండ్ల సాధన కోసం రేపు జరగబోయే గ్రామీణ భారత్ బంద్ జయప్రదం చేయాలని కోరారు. కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, మేధావులు, రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజల అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో బద్రి నాయక్, పెరమల్లె యాకయ్య, నరసయ్య, వెంకన్న, ఐలేష్, తదితరులు పాల్గొన్నారు.

## సార్వత్రిక సమ్మెకు సంపూర్ణ మద్దతు



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** దేశవ్యాప్తంగా నేడు చేపట్టనున్న సార్వత్రిక సమ్మెకు సంపూర్ణ మద్దతును ప్రకటిస్తున్నట్లు ప్రైవేట్ బస్సు డ్రైవర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు పాశం మల్లికార్జున్ గురువారం తెలిపారు. మండల కేంద్రంలో సిద్ధార్థ ప్రిన్సిపాల్ అండెం కరుణాకర్ రెడ్డికి సమ్మె నోటీసు పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా కార్మికుల చట్టాలను సవరణ చేస్తూ తీసుకున్న నిర్ణయాలను వ్యతిరేకిస్తూ సమ్మెకు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. కార్మికుల అందరూ సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్స్ యూనియన్ నాయకులు లక్కరాజు టేకుల స్వామి, రఘు, బాదావత్ రమేష్, అన్నబోయిన అనిల్, ప్రశాంత్, సునీల్, ముప్పిడి స్వామి, అనిల్ వీరన్న, వెంకన్న, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సమ్మెను విజయవంతం చేయాలి

### ఐఎన్టీయూసీ మండల అధ్యక్షుడు రాజేందర్



**వరంగల్ వాయిస్, శాయంపేట :** కార్మికులకు కనీస వేతనం చెల్లించడంతో పాటు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ తో నిర్వహించ తలపెట్టిన దేశ వ్యాప్త కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలని ఐఎన్టీయూసీ మండల అధ్యక్షుడు మారపెల్లి రాజేందర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ వరంగల్ లోని పోచమ్మ మైదాన్ లో సమ్మెలో భాగంగా నిరసన కార్యక్రమం నిర్వహించ నున్నారని, కార్మికులు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు.

# 17న వడుప్సా ఎస్సెస్సీ ఓరియెంటేషన్ ప్రోగ్రాం

### విజయవంతం చేయాలని పిలుపు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఉర్సుగుట్టలోని నాని ఏసీ గార్డెన్స్ లో గురువారం ఉదయం 11గంటలకు వడుప్సా వరంగల్ జిల్లా అధ్యక్షుడు అంకటి వీరస్వామి అధ్యక్షతన ప్రెస్ మీట్ నిర్వహించారు. 17 శనివారం ఉదయం 8:30 నిమిషాల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వడుప్సా వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎస్సెస్సీ స్టూడెంట్స్ కు ఓరియంటేషన్ ప్రోగ్రాం స్టేట్ రిసోర్స్ పర్సన్స్ చేతుల మీదుగా సబ్జెక్ట్స్ వారీగా నిర్వహించడం జరుగుతుందని జిల్లా ముఖ్య సలహాదారుడు ఎన్.వెంకటేశ్వర రావు తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా వరంగల్ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, ఆర్జేడీఎస్ సత్యనారాయణ రెడ్డి, వరంగల్ డీఈవో బి.వాసంతి, వరంగల్ ఎంఈఓ కే.విజయ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని వడుప్సా వరంగల్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఆడెపు శ్యామ్ తెలియజేశారు. వరంగల్ జిల్లాలోని అన్ని మండలాల నుంచి దాదాపు 100పాఠశాలలకు పైగా దాదాపు 2000 మంది విద్యార్థులకు ఈ ఓరియంటేషన్ ప్రోగ్రాం పదో తరగతి పరీక్షల్లో 10/10 ఉత్తమ ఫలితాలు సాధించడానికి ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. ఈ సదవకాశాన్ని ప్రతి పాఠశాల కరస్పాండెంట్ ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు క్రమశిక్షణతో సమయానికి హాల్ కు చేరుకొని తమకు ఉన్న సందేహాలను సబ్జెక్టుల నిపుణులతో నివృత్తి చేసుకొని ప్రతి విద్యార్థి తమ బంగారు భవిష్యత్తు నిర్మించుకోవాలని జిల్లా ప్రధాన కార్యదర్శి బిల్లా రవి కోరారు. ఈ కార్యక్రమంలో వడుప్సా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆడెపు వెంకటేశ్వర్లు, ఖిలా వరంగల్ జోన్ అధ్యక్షుడు ముక్కెర రవీందర్, జోన్ ప్రధాన కార్యదర్శి దాస్ సతీష్ మూర్తి, వరంగల్ జోన్ ఉపాధ్యక్షుడు కూచన క్రాంతి కుమార్, జిల్లా కోశాధికారి టి.జ్ఞానేశ్వర్ సింగ్, జిల్లా సలహాదారులు పోన్నోజు చక్రపాణి, కోశాధికారి కొరపాటి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## రేపు దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

### వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ పిలుపు



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** రేపు జరగబోయే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాపురం మహేందర్ పిలుపునిచ్చారు. గురువారం రఘునాథపల్లి మండలంలోని కోమల్ల గ్రామంలో ఉపాధి హామీ కూలీలను సందర్శించి సమ్మె వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఆ తర్వాత మహేందర్ మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న ఉపాధి హామీ బిల్లులను వెంటనే ఇవ్వాలని, వందరోజుల పని దినాన్ని 200కు పెంచాలని, ఎలాంటి కొలతలు లేకుండా రోజువారి వేతనం రూ.600లకు పెంచాలన్నారు. దేశంలో నరేంద్ర మోడీ తన పాలనలో కార్మిక హక్కులను కాలరాస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేశారని, రేపు నరేంద్ర మోడీ అవలంబిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## ప్రభుత్వ కొలువులు పొందడం అభినందనీయం

### అదనపు కలెక్టర్ అశ్వని తానాజీ వాకాడే



**వరంగల్ వాయిస్, వరంగల్ :** జిల్లాలో సంక్షేమ గురుకులాలలో ప్రభుత్వ కొలువులు పొందడం హర్షించదగ్గ విషయమని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు అశ్వని తానాజీ వాకాడే పేర్కొన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా ట్రైబల్ వెల్ఫేర్ సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్ సంక్షేమ గురుకులాలలో ఉద్యోగాలు సాధించిన 42మంది ఉద్యోగులు నియామక పత్రాలు పొందుటకు హైదరాబాద్ ఎల్బీ స్టేడియానికి వెళ్లటానికి అధికారులు ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సును అదనపు కలెక్టర్ అశ్వినీ తానాజీ వాఖేడ్ జెండా ఊపి ప్రారంభించారు. ప్రభుత్వ కొలువులు సాధించి ఉద్యోగ నియామక పత్రాలు పొంది విధి నిర్వహణలో అంకిత భావం, క్రమశిక్షణతో విధులు నిర్వర్తించి మంచి పేరు తీసుకురావాలని అదనపు కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ రామ్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ ఆర్ సీఓ మనోహర్ రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ, సూపరిండెంట్ మంగ మల్లయ్య, సోషల్ వెల్ఫేర్ సూపర్ డెంట్ జి సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రేపటి సమ్మెకు బీఎన్ఆర్‌కేఎస్ కార్మికుల మద్దతు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మేము సైతం సమ్మెలో పాల్గొంటామని బీఎన్ ఆర్ కేఎస్ (భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మూలవీర నర్సింహులు అన్నారు. గురువారం బీఎన్ ఆర్ కేఎస్ జిల్లా కమిటీ హనుమకొండ ఏకశీల పార్కులో జరిగిన సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి, హనుమకొండ జిల్లా ఇంఛార్జి పంకెర్ల కుమారస్వామి యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భవన నిర్మాణ 10 రంగాల కార్మికులు అనేక సమస్యల్ని ఎదుర్కొంటున్నారని తెలిపారు. అదేవిధంగా బీఎన్ ఆర్ కేఎస్, రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కామల్ల ఐలన్నా ఆదేశాల మేరకు నేడు బీఎన్ ఆర్ కేఎస్ హనుమకొండ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. గత జనవరి 30న హైదారాబాద్ లో రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో సభ్యత్వం పుస్తకాలు తీసుకున్న వారు మన ఈ జిల్లాలో విస్తృతంగా, విరివిగా భవన నిర్మాణ 10 రంగాల కార్మికుల దగ్గరకు వెళ్లి సభ్యత్వాలు తీసుకోవాలని జిల్లా, మండల, గ్రామ, నాయకత్వాన్ని కోరారు. కేంద్ర ప్రభుత్వం, కార్మిక చట్టాలను నాలుగు కోడ్ లుగా విభజన చేసి, కార్మికుల నోట్లో మట్టి కొట్టే ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. కార్మికులకు నష్టం చేసే ఆ చట్టాలను వెనక్కి తీసుకోవాలని బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం బీఎన్ ఆర్ కేఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మూలవీర నర్సింహులు, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి, యండీ అజీమొద్దీన్ లు మాట్లాడుతూ రేపు జరగబోయే ఆల్ ట్రేడ్ యూనియన్స్, సంఘాలు చెసే సమ్మెలో పాల్గొంటున్నామని తెలిపారు. రేపు జరగబోయే సమ్మెలో భవన నిర్మాణ 10 రంగాల కార్మికులు పాల్గొనాలని, కార్మికులకు పిలుపునిచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం దొంగ లేబర్ కార్డులను వెంటనే తొలగించాలని, మీ సేవా కేంద్రాల ద్వారా ఇచ్చే లేబర్ కార్డులను వెంటనే ఆపివేయాలని, సెపరేట్ రాష్ట్ర వ్యాప్తంగా రాష్ట్ర వెల్ఫేర్ బోర్డు ద్వారా వెబ్ సైట్ ఓపెన్ చేసి నిజమైన కార్మికులకు మాత్రమే లేబర్ కార్డులను ఇవ్వాలని, అలాగైతేనే నిజమైన కార్మికులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని, సమస్య పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా హనుమకొండ జిల్లా లేబర్ ఆఫీసులో ఉన్నా క్లైమ్స్ వెంటనే విడుదల చేయాలని లేబర్ కమిషనర్ కోరారు. ఈకార్యక్రమంలో బీఎన్ ఆర్ కేఎస్, హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు బొంకూరి ఐలయ్య, కార్యదర్శి వెంగాల సంపత్, మామిడాల సాగర్ పాల్గొన్నారు.

# 17న చైతన్య విశ్వవిద్యాలయ స్నాతకోత్సవం

## వీసీ డాక్టర్ పురుషోత్తం రెడ్డి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఈ నెల 17న చైతన్య డీమ్డ్ టు బి విశ్వవిద్యాలయంలోని పూర్వపు చైతన్య డిగ్రీ, పీజీ కళాశాల స్వయం ప్రతిపత్తి కిషన్ పురలోని పన్నెండవ స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని ఛాన్సలర్ డా సీహెచ్ వి.పురుషోత్తం రెడ్డి తెలిపారు. గురువారం కిషన్ పుర చైతన్య (డీమ్డ్ టు బి విశ్వవిద్యాలయం)లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ భారత ప్రభుత్వం చైతన్య (డీమ్డ్ టు బి విశ్వవిద్యాలయం)ను 2019 సంవత్సరంలో గుర్తించి విశ్వవిద్యాలయం స్థాయిని ప్రకటించిందని, ఈ సందర్భంగా ఈ నెల 17న 12వ స్నాతకోత్సవాన్ని ఘనంగా మా పూర్వపు డిగ్రీ, పీజీ కళాశాల వారితో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ స్నాతకోత్సవానికి ముఖ్య అతిధిగా ఎస్.చంద్రశేఖర్, మాజీ సెక్రెటరీ, డిపార్ట్ మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నోలో భారత ప్రభుత్వం, అతిధులుగా తెలంగాణ రాష్ట్ర సమితి నాయకుడు పెద్ది రెడ్డి, డాక్టర్ ఎ.కళ్యాణ్ చక్రవర్తి, సీనియర్ వైస్ ప్రెసిడెంట్, డా.రెడ్డీస్ ల్యాబ్ హైదరాబాద్ వారు హాజరవుతారని తెలిపారు . తమ విశ్వవిద్యాలయం 24 సంస్థలతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నదని ఇందులో భాగంగా అమెరికాలోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాలతో కూడా స్టూడెంట్స్ ఎక్స్ చేంజ్ ప్రోగ్ ను, ప్రముఖ సాఫ్ట్ వేర్ సంస్థలైన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ తో అకడమిక్ ఇంటర్ ఫేస్ ప్రోగ్రాంలో బీఎస్సీ, బీబీఏ విద్యార్థులకు కోర్సు ప్రవేశపెట్టి అవగాహన ఒప్పందాలను కుదుర్చుకున్నామన్నారు. అలాగే ప్రముఖ సాఫ్ట్ వేర్ కంపెనీ అయిన ఐబీఎంతో జాయింట్ డిగ్రీ ప్రోగ్రామ్ క్రింద అన్నీ కోర్సులకు విద్యను అందించే విధంగా, ఐఐసీటీ, హిందూస్థాన్ బేక్ టెక్, సీఎస్ ఏ, తెల్సా డయోగ్నోస్టిక్స్, వీకేర్ బయోలాబ్స్, దివిట్ మెడికల్ బిల్డింగ్ కంపెనీ, అమెరికా, అజారా హెల్త్ అండ్ మెడికేర్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి సంస్థలతో వివిధ అంశాలలో అవగాహనా ఒప్పందాలను కుదుర్చుకున్నామన్నారు. ఈ నెల 17 న జరగబోయే స్నాతకోత్సవంలో 756 మంది విద్యార్థులు తమ డిగ్రీ పట్టాలను పొందనున్నారని తెలిపారు. ఈ స్నాతకోత్సవ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో వైస్ ప్రెసిడెంట్ విక్రమ్ రెడ్డి, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డా సీహెచ్ సాత్విక, రిజిస్ట్రార్ ప్రొ.ఎం.రవీందర్, ఓఎస్డీ డా.కె వీర వెంకటయ్య , అసిస్టెంట్ రిజిస్ట్రార్, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ జి.రాంబాబు , డీన్ అఫ్ సైన్స్ ప్రో.ఎం.సుందర్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

## తాత్కాలిక బస్ స్టేషన్ పరిశీలన



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఈనెల 18 నుంచి ప్రారంభం కానున్న మేడారం జాతరను పురస్కరించుకొని వరంగల్ లో ఏర్పాటు చేస్తున్న తాత్కాలిక బస్ స్టేషన్ ను వరంగల్ నగర పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్, వరంగల్ నగర పాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ రాధికా గుప్తా, ఆర్టీసీ రీజనల్ మేనేజర్ జే శ్రీలత, ఇతర అధికారులు సందర్శించారు. వరంగల్ తాత్కాలిక బస్ స్టేషన్ లో ఏర్పాటు చేస్తున్న క్యూలైన్లను, ప్రయాణికులు కూర్చునేందుకు ఏర్పాటు చేస్తున్న చలవ పందిళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్టీసీ వరంగల్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ భాను కిరణ్, హనుమకొండ ఆర్టిసి డిపో మేనేజర్ భూక్యా ధరమ్ సింగ్, హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్ జీ, వరంగల్ ఏసిపి బోనాల కిషన్, హనుమకొండ ఏసిపి కొత్త దేవేందర్ రెడ్డి, వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ భోజరాజ్, మట్టెవాడ ఇన్ స్పెక్టర్ టి గోపి, ఇంతేజార్ గంజ్ ఇన్ స్పెక్టర్ ఎల్ పవన్ కుమార్, వరంగల్ ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ శ్రీధర్, ఆర్టీసీ ట్రాఫిక్ సూపర్ వైజర్ నజియా సుల్తానా, ఆర్టీసీ ఉద్యోగులు కె ఎస్ రావు , ఎండీ గౌస్ మొహినుద్దీన్, పబ్బాల వెంకటేశ్వర్లు, డీఆర్ రెడ్డి, ఎస్ కే వై పాషా తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఓ-సిటీలో ఏర్పాటు చేస్తున్న బస్ పార్కింగ్ స్థలాన్ని పరిశీలించారు.

## నూతన గృహప్రవేశానికి హాజరైన హుస్సేన్



**వరంగల్ వాయిస్, నెల్లికుదురు :** మండలంలోని చెట్ల ముప్పారం గ్రామంలో మహబూబాబాద్ జిల్లాకు చెందిన జాతీయ మానవ హక్కుల న్యాయ సేవా సంఘం జిల్లా పబ్లిక్ రిలేషన్ షిప్ బాధ్యులు నామాల మహేష్ వారి ఇంటి నూతన గృహప్రవేశానికి, పంచ కట్టు కార్యక్రమానికి నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ సోషల్ సర్వీస్ ఫర్ చేంజ్ అఫ్ ఇండియా అధ్యక్షుడు మంగళ పెల్లి హుస్సేన్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ పానుగంటి విష్ణువర్ధన్, తెలంగాణ రాష్ట్ర జనరల్ సెక్రటరీ మాచర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే నాగరాజును కలిసిన సీఐ సురేష్



**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి :** హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే కోటర్స్‌లో హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన జే.సురేష్ గురువారం వర్ధన్నపేట శాసనసభ్యుడు కేఆర్ నాగరాజును మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో రాజీ లేకుండా పని చేయాలని సీఐకి సూచించి శుభాకాంక్షలు తెలిపారు.

## నూతన ఎంపీడీఓగా వీరేశం



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** భీమదేవరపల్లి మండల నూతన ఎంపీడీఓగా వీరేశం గురువారం బాధ్యతలు స్వీకరించారు. లోకసభ ఎన్నికల దృష్ట్యా బదిలీల్లో భాగంగా గీసుకొండ మండల ఎంపీడీఓగా పనిచేసిన వారు భీమదేవరపల్లి మండలానికి బదిలీపై వచ్చారు. గత ఎంపీడీఓ భాస్కర్ భూపాలపల్లి బదిలీపై వెళ్లారు. ఈసందర్భంగా మండల ప్రజలు సహకరించాలని ఎంపీడీఓ కోరారు.

## మాజీ ఎమ్మెల్యే చల్లాకు ఆహ్వానం



**వరంగల్ వాయిస్, పరకాల :** నడికుడ మండలం వరికోల్ గ్రామంలో రేపటి నుంచి 21వరకు నిర్వహించనున్న శ్రీ శ్రీ శ్రీ కంఠమహేశ్వర స్వామి సురమాంబ దేవి వనం ఎల్లమ్మ జమదగ్ని మహాముని కళ్యాణ మహోత్సవానికి మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని హనుమకొండలోని వారి నివాసంలో ఆ గ్రామ గౌడ సంఘం నాయకులు కలిసి ఆహ్వానించారు.

## చెత్తతో విద్యార్థులకు ఇబ్బందులు



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలోని హుజురాబాద్ రోడ్ బిట్స్ పాఠశాల ఎదురుగా కుప్పలుగా చెత్త పోయడం దానిని మునిసిపాలిటీ సిబ్బంది తగులబెట్టడం వల్ల పాఠశాల విద్యార్థిని విద్యార్థులు ఆ పొగతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలు పాఠశాల ఎదురుగా చెత్త పోసేది ఎవరూ, ఒకవేళ పాఠశాల వాళ్లే అయితే మునిసిపల్ సిబ్బంది ఏం చేస్తున్నారు. పట్టణం అవతల పోయాల్సిన చెత్త ఇక్కడ వేస్తుంటే సానిటేషన్ శాఖ సిబ్బంది, అధికారులు ఎందుకు పట్టించుకోకుండా ఉంటున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పుడు ప్లాస్టిక్ కవర్లు ,చెత్త కాలబెట్టడం వల్ల వచ్చే వాయువులు పాఠశాలలోని చిన్న పిల్లలు పీల్చుకొని అస్వస్థతకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళనకు గురవుతున్నారు. అలాగే పక్కనే పెట్రోల్ బంక్ ఉంది. ఇది ఇంకా చాలా ప్రమాదమని తెలిసినా ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే పాఠశాల ఎదురుగా చెత్త పోయకుండా మునిసిపల్ సిబ్బంది చూడాలని పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

## బండి సంజయ్‌ని కలిసిన వరంగల్ బీజేపీ నేతలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** భారతీయ జనతా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కరీంనగర్ పార్లమెంటు సభ్యుడు బండి సంజయ్ కుమార్ నిర్వహిస్తున్న ప్రజాహిత పాదయాత్ర సిరిసిల్లకు చేరుకున్న క్రమంలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంటు సభ్యుడు బండి సంజయ్ కుమార్ ను వరంగల్ జిల్లా బీజేపీ నాయకుడు డాక్టర్ వన్నాల వెంకటరమణ. వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు కనుకుంట్ల రంజిత్ కుమార్, అపురూప రజనీష్ నేత, రతన్ తదితరులు కలిశారు.

## మల్హార్ ఎంపీడీఓగా శ్యామ్ సుందర్



**వరంగల్ వాయిస్, మల్హార్ :** మండల నూతన ఎంపీడీఓగా కె.శ్యామ్ సుందర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో మల్హార్ ఎంపీడీఓగా పని చేసిన జి.నరసింహ మూర్తి ఇటీవలే బదిలీ కాగా ఆయన స్థానంలో శ్యామ్ సుందర్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నూతన ఎంపీడీఓకు ఎంపీపీ చింతల పల్లి మల్హాల్ రావు, సూపరిండెంట్ మూర్తి, ఏపీఓ గిరి హరీష్, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, కార్యదర్శులు శుభాకాంక్షలు తెలిపారు.

## బాధితుడికి ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, గీసుగొండ :** గీసుగొండ మండలం మనుగొండ గ్రామానికి చెందిన చాపర్తి కుమారస్వామికి గత 20రోజుల క్రితం యాక్సిడెంట్ కాగా, కాలు బొక్క విరిగింది. ఈ విషయం తెలుసుకున్న జిల్లా కాంగ్రెస్ నాయకుడు అల్లం బాలకిషోర్ రెడ్డి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు గురువారం బాధితుడిని పరామర్శించి రూ. 5000 ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకుడు అల్లం మర్రెడ్డి, కొమ్ము శ్రీకాంత్, కందికొండ రాజు, మాదాసి రాంబాబు, తోట కమలాకర్, ఏంబాడీ రాజకుమార్, యోగేందర్, ఉదయ్, కనుకయ్య, చాపర్తి రాజు, సూరయ్య, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

# చర్చిని కూల్చిన దుండగులను అరెస్టు చేయాలి

## పాస్టర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి మరుపట్ల అబ్రహం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** చేవెళ్ల నియోజకవర్గం శంకర్ పల్లి మండలం జన్వాడ గ్రామంలో పెద్ద సంఖ్యలో ఆర్ఎస్ఎస్ గూండాలు గ్రామంలో ఉన్నటువంటి మెథడిస్టు చర్చ్ పై దాడి చేసి చర్చిని ధ్వంసం చేస్తూ అక్కడున్న క్రైస్తవులపైన కర్రలతో ఇనుప రాడ్లతో దాడి చేసిన మతోన్మాదులను వెంటనే అరెస్ట్ చేయాలని తెలంగాణ పాస్టర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి మరుపట్ల అబ్రహం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో వరంగల్ కమిషనరేట్ పరిధిలో ఉన్న క్రైస్తవులకు, చర్చ్ లకు పూర్తి స్థాయి రక్షణ కల్పించాలని, తెలంగాణలో ప్రతి చర్చ్ కి ఒక్క హెూమ్ గార్డ్ ను నియమించాలన్నారు. అలాగే వరంగల్ కమిషనరేట్ పరిధిలో ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఇయర్ వైస్ డిగ్రీ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించాలి





**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉన్న డిగ్రీ ఇయర్ వైస్ విద్యార్థులకు యూనివర్సిటీ అధికారులు పరీక్షలు నిర్వహించకపోవడంతో ఏబీ ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వీసీ ఆఫీస్ ముందు ఏబీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షురాలు మంద ప్రమీల నరేష్ మాట్లాడుతూ ఇయర్ వైస్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. యూనివర్సిటీ పరిధిలో దాదాపు వెయ్యి మంది విద్యార్థుల పరీక్షలు రాయడానికి సిద్దంగా ఉన్నారని, ఎందుకు యూనివర్సిటీ అధికారులు పరీక్షలు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. ఒక సబ్జెక్టుకు రూ.7500 పరీక్ష ఫీజును యూనివర్సిటీ అధికారులు తీసుకోవడం జరుగుతుందని, అయినా కానీ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించకపోవడంతో పోటీ పరీక్షలకు దూరం అవ్వడం జరుగుతుందన్నారు. ఇప్పటికైనా యూనివర్సిటీ అధికారులు స్పందించి ఇయర్ వైస్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా చేయడంతో యూనివర్సిటీ రిజిస్ట్రార్ మల్లారెడ్డి వచ్చి విద్యార్థి నాయకులకు సర్ది చెప్పి త్వరలో ఒక కమిటీ వేసి పరీక్షలు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం అడిషనల్ బ్రాంచ్ కంట్రోలర్ తిరుమల దేవికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ కాకతీయ యూనివర్సిటీ అధ్యక్షుడు మచ్చ పవన్ కళ్యాణ్, నాయకులు పృథ్వీ రాజ్, నరేందర్, ఉదయ్ కిరణ్, సాయి కిరణ్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# సీపీని కలసిన నూతన ఏసీపీలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రభుత్వ ఉత్వర్వుల మేరకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వివిధ డివిజన్లల్లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన నూతన ఏసీపీలు గురువారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలను అందజేశారు. పోలీస్ కమిషనర్‌ను కలిసిన వారిలో కాజీపేట, నర్సంపేట, జనగాం, వర్ధన్నపేట, మామూనూర్ ఏసీపీలు తిరుమల్, కిరణ్‌కుమార్, దామోదర్ రెడ్డి, నర్సయ్య, సతీష్ బాబు ఉన్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ నిబద్దతతో పనిచేస్తూ బాధితులకు సేవలందించాలని, నిరంతరం తన పరిధిలో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది పనతీరుపై పర్యవేక్షణ వుండాలని పోలీస్ కమిషనర్ తెలిపారు.

# గుండెపోటుతో ఆటో డ్రైవర్ మృతి



**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** ఆర్థిక ఇబ్బందులతో అప్పుల పాలైన ఆటో డ్రైవర్ గుండె పోటుతో మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో గురువారం జరిగింది. మండల కేంద్రానికి చెందిన సీనియర్ ఆటో డ్రైవర్ బొడ్డు విల్సన్ (49) గత 30 సంవత్సరాలుగా ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తూ ఉండేవారు. అతడికి భార్య ఇద్దరు కుమారులు, తల్లి ఉన్నారు. గత కొంతకాలం క్రితం బీపీ, షుగర్ వ్యాధులతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురై, స్థానికంగా సహకార సంఘాలల్లో అప్పులు తీసుకోవడంతో వాటిని తిరిగి చెల్లింపులలో అధిక వడ్డీలకు డబ్బులు తీసుకొని తీవ్రంగా నష్టపోవడం కాస్త ఆందోళనకు దారితీసింది. ఇలా అప్పుల పాలు కావడం, ఇటీవల మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం కారణంగా ఆటోలకు గిరాకి లేక కుటుంబం గడవక తీవ్ర మానసిక ఆందోళనకు లోనై గురువారం ఉదయం గుండెపోటుతో హఠాత్తుగా మృతి చెందాడు. దీంతో ప్రభుత్వ పరంగా తమ కుటుంబాన్ని ఆదుకోవాలని అతడి భార్య పిల్లలు, తల్లి, స్థానిక ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాప్రతినిధులను కోరుతున్నారు. ఆటో డ్రైవర్ల పరిస్థితి ఈ రకంగా కాకుండా ప్రభుత్వం వీరి కోసం బడ్జెట్ లో ప్రత్యేక నిధులను కేటాయించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# ప్రభుత్వ భూములను పరిరక్షించుకోవాలి

## జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా



**వరంగల్ వాయిస్, కాటారం:** ప్రభుత్వ భూములు అన్యాక్రాంతానికి గురి కాకుండా చూడాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. గురువారం కాటారం మండల కేంద్రంలోని కూరగాయల మార్కెట్ సమీపంలోని క్రీడా ప్రాంగణాన్నీ సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. క్రీడా ప్రాంగణం అభివృద్ధి కి 30 లక్షల నిధులు మంజూరు అయినందున రూ.10లక్షల వ్యయంతో చుట్టు ఇనుప కంచెను ఏర్పాటు చేసి రూ.20 లక్షలతో మైదానంలో 50 లేదా 60 మంది కూర్చోని క్రీడలను వీక్షించేలా మెట్లు నిర్మాణం చేయాలని కోరారు. అలాగే క్రీడా మైదానంలో ఆయా రకాల క్రీడలను ఆడేందుకు గాను పలు మౌలిక సదుపాయలు కల్పనకు కృషి చేయాలన్నారు. క్రీడా సామగ్రిని భద్రపరిచేందుకు వీలుగా ఒక మినీ బిల్డింగ్ ను నిర్మాణం చేసి సోలార్ లైట్లు, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ముఖ్యంగా క్రీడల్లో యువత ఆసక్తి చూపేలా, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, క్రికెట్ క్రీడలకు ప్రాముఖ్యత నిచ్చేలా క్రీడా ప్రాంగణాన్ని నెలకొల్పాలని అంచనా వ్యయాన్ని రూపొందించి, త్వరితగతిన పనులను మొదలు పెట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రైమరీ హెల్త్ సెంటర్ లో ఖాళీ ప్రదేశాన్ని పూలు పండ్ల చెట్లతో సుందరీ కరణ చేయాలన్నారు. మండల కేంద్రంలోని 5ఎకరాల విస్తీర్ణంతో ఎర్రకుంట చెరువు శిఖం భూమిని చదును చేసి ఇర్రిగేషన్ శాఖ నుంచి ఎన్ ఓసీ తీసుకుని పలు ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం కోసం భూమిని వినియోగించుకోవాలన్నారు. కాటారం మండలంలోని మద్దులపల్లి గ్రామ శివారులో గల రెండున్నర ఎకరాల ఫారెస్ట్ భూమిని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని, ఎంపీసీ బిల్డింగ్ నిర్మాణానికి వినియోగించాలని కలెక్టర్ అన్నారు. అనంతరం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించి 10వ తరగతి విద్యార్థులకు గణితం, ఫిజిక్స్, బయో సైన్స్ పాఠాలను బోధించి వచ్చే నెలలో జరిగే 10వ తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి మెరుగైన ఫలితాలు సాధించి భవిష్యత్ లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులను కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ అధికారులు సాయిలు, ఆశోక్, ఎంపీపీ సమ్మయ్య, తహసీల్దార్ నాగరాజు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగానికి నిధులు ఎక్కువగా కేటాయించాలి

## ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పట్ల మధు



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** తెలంగాణ రాష్ట్ర విద్యారంగం పెద్ద సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సందర్భంలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆశాజనకంగా లేదని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పట్ల మధు అన్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ తొర్రూరు మండల కమిటీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన అతిథిగా హాజరై మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో 21,389 కోట్ల రూపాయల విద్యారంగానికి కేటాయించారు. 500 కోట్ల నూతన ప్రభుత్వ పాఠశాలల ఏర్పాటుకు, 500 కోట్ల రూపాయలు ప్రభుత్వ యూనివర్సిటీల నిర్వహణకు, అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ పాఠశాలలకు సొంత భవనాలకు 1546 కోట్ల రూపాయలు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ,1000 కోట్ల రూపాయలు సాంఘిక సాంఘిక సంక్షేమ, 250 కోట్ల రూపాయలు గిరిజన సంక్షేమ పాఠశాలల నూతన భవనాల ఏర్పాటుకు కేటాయించారు. శాఖల వారీగా నూతన భవనాల నిర్మాణం కోసం కేటాయించిన మొత్తం ఏమాత్రం సరిపోదు, ఈ బడ్జెట్ తో అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ పాఠశాలలకు సొంత భవనాల నిర్మాణం కల నెరవేరదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న అద్దె భవనాలకు నెలకు వందల కోట్ల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోందని చెప్పారు. 650 పై చిలుకు గురుకులాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. పాఠశాల, ఉన్నత విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం మౌళిక సదుపాయాల కల్పనకు కేటాయించిన బడ్జెట్ ఏ మాత్రం సరిపోదని మండిపడ్డారు. రాష్ట్రంలో 7800 కోట్ల రూపాయల పెండింగ్ స్కాలర్షిప్స్, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలున్నాయి. రాష్ట్ర బడ్జెట్ లో సంక్షేమ వసతి గృహాలకు మెస్, కాస్మొటిక్ ఛార్జీల పెంపు ప్రస్తావన లేదు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్లో రాష్ట్ర విద్యారంగంలో నెలకొన్న సంక్షోభాన్ని గాలికొదిలేసిందని విమర్శించారు. విద్యారంగానికి నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. తక్షణమే విద్యా రంగ సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. లేకుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ది చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు మహేష్, సుమంత్, చరణ్, పండు, శ్రావణి, మహేశ్వరి కుమార్ పాల్గొన్నారు.

# పదో తరగతి అంతర్గత మార్కుల పరిశీలన



**వరంగల్ వాయిస్, మరిపెడ:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం మరిపెడ మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు తానంచర్ల, సెయింట్ ఆగస్టిన్, భారతి విద్యా మందిర్, వీరారం ఉన్నత పాఠశాలలోప్రధానోపాధ్యాయులు అనంతరావు, రామ్మోహన్ వెంకన్న ల తనిఖీ బృందం అంతర్గత మార్కుల పరిశీలన చేశారు. విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరీక్షించే రికార్డులను తనిఖీ చేశారు. రికార్డులతో పాటు విద్యార్థులు తయారుచేసిన ప్రయోగాత్మక పద్ధతులను వివరించే చార్ట్ ల వివరాలను తనిఖీ బృంద సభ్యులు ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పలువురి విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అనంతరావు మాట్లాడుతూ మార్చి మాసంలో జరగనున్న పబ్లిక్ పరీక్షల దృష్ట్యా తొలుత పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించేందుకు అంతర్గత మార్కుల పరిశీలన జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తానంచర్ల హెచ్ఎం అనిత, సెయింట్ అగస్టీన్ పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ ఫ్రాన్సీ, వీరారం హెచ్ఎం లక్ష్మీ నిర్మల, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సీఐ రంజిత్ రావును కలిసిన కాంగ్రెస్ నాయకులు



**వరంగల్ వాయిస్, శాయంపేట :** శాయంపేట సర్కిల్ సీఐగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రంజిత్ రావును కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ క్రమంలో మండల నాయకులు సీఐకి పుష్పగుచ్చం అందజేసి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి మాట్లాడుతూ సీఐ విధినిర్వహణలో మండల కాంగ్రెస్ నాయకులు పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పత్తిపాక ఎంపీటీసీ గజ్జి ఐలయ్య, మారేపల్లి బుజ్జన్న, చిందం రవి, అబ్బు ప్రకాష్ రెడ్డి, వలి హైదర్, తడుక కుమారస్వామి, చింతల రవిపాల్, రఫీ, మారపల్లి రాజు, మారపల్లి రాజేందర్, రమేష్, తిరుపతి, కొమ్ముల భాస్కర్, వీరన్న, పత్తి శీను పాల్గొన్నారు.

# దేశం గర్వించదగ్గ ఆధ్యాత్మికవేత్త సేవాలాల్



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** భారతదేశం గర్వించదగ్గ ఆధ్యాత్మికవేత్త సేవాలాల్ మహారాజ్ అని సేవవాల్ సేన మండలాధ్యక్షుడు భూక్య బాలు అభివర్ణించారు. గిరిజనులు ఆరాధ్యుడు సంత్ సేవలాల్ 285వ పుట్టిన రోజు సందర్భంగా సేవా లాల్ సేన ఆధ్వర్యంలో మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించి స్థానిక శివాలయంలో భోగ్ బండారో కార్యక్రమాని నిర్వహించారు. 1739 ఫిబ్రవరి 15వ తేదీన అనంతపూర్ జిల్లా గుత్తి సమీపంలోని (రాంజీనాయక్ తండా) సేవాగఢ్‌లో జన్మించిన ఆయన ఆధ్యాత్మిక గురువు, సంఘ సంస్కర్త నిజాం, మైసూరు పాలకుల దారుణాలకు వ్యతిరేకంగా బంజారాల హక్కుల కోసం సంత్ సేవాలాల్ వీరోచితంగా పోరాటం చేశారన్నారు. ఆంగ్లేయులు, ముస్లిం పాలకుల ప్రలోభాలు లొంగకుండా బంజారాలు మతం మారకుండా ఎంతో కృషి చేశారన్నారు. అందులో ముఖ్యంగా బంజార జాతి ఔనత్యాన్ని ప్రపంచానికి చాటేలా అహింసా సిద్ధాంతాలకు పునాదులు వేశారని, అందుకే సంత్ సేవాలాల్ ఇతర కులాల వారికి ఆదర్శమూర్తిగా నిలిచారని పేర్కొన్నారు. లిపి లేని బంజారాల భాషకు ఒక రీతిని తీసుకువచ్చిన ఘనత సేవాలాల్ దని అన్నారు. సేవాలాల్ తన పాటలు రచనల ద్వారా ప్రజలను జాగృత చేయడానికి అనేక ప్రబోధాలు బోధించాడని ఆయన ఆశయలకు ప్రతి గిరిజనుడు పాటుపడాలని సూచించారు. మాజీ సర్పంచ్ పాండు నాయక్, చైర్మన్ వీరన్న, శ్రీరాం, మోహన్, శంకర్, సునీత వీరన్న, హున్యానాయక్, రాజారాం, బాలాజీ, భద్రు నాయక్, రమేష్, భీంజీ, కోటేష్, బద్యా నాయక్, రాంబాబు, సురేష్, కృష్ణ, భావ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## సేవాలాల్ గొప్ప సమాజ సేవకుడు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** గిరిజను(లంబాడీ)ల ఆరాధ్య దైవం శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ గొప్ప సమాజ సేవకులని, వారి ఆశయ సాధనలో ప్రతి ఒక్కరూ నడవాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ కోరారు. గురువారం సమీకృత జిల్లా అధికారుల భవన సముదాయ సమావేశం మందిరంలో సంత్ శ్రీ శ్రీ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి వేడుకలను ప్రభుత్వ ఆధ్వర్యంలో గిరిజన సంక్షేమ శాఖ ఘనంగా నిర్వహించింది. సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి జిల్లా కలెక్టర్ అధికారులు పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంత్ శ్రీశ్రీశ్రీ సేవాలాల్ మహారాజ్ అంటే ధర్మానికి ప్రతిరూపమని, గిరిజనులకు దశా దిశానిర్దేశం చేసిన మహెూన్నత వ్యక్తి అని కారణజన్ముడని కొనియాడారు. 1739 ఫిబ్రవరి 15న అనంతపురం జిల్లా రాంజీ నాయక్ తండాలో సేవాలాల్ మహారాజ్ జన్మించారని, జంతుబలికి తీవ్ర వ్యతిరేకిగా నిలిచారన్నారు. సంచార జీవనం కొనసాగిస్తూ బంజారా జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటేలా సిద్ధాంతానికి పునాదులు వేశారన్నారు. ప్రజల కోసం ధర్మ ప్రచారం ఆర్థిక సంస్కరణలు చేపట్టి మతమార్పిడులను అరికట్టడం తో పాటు జాతిని సన్మార్గంలో నడిపించేందుకు కృతకృత్యులయ్యారన్నారు. కుల మతాలకు అతీతంగా కలివిడిగా ఉండేవారని ధైర్య సహాసాలకు ప్రతీకలని, తరతరాలుగా జాతి వివక్షతకు గురవుతూ ఆర్థిక సామాజిక రాజకీయ అభివృద్ధిలో వెనుకబడి ఉన్న లంబాడాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని భావించారన్నారు. సేవాలాల్ అందరివాడని ధర్మానికి కట్టుబడి పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో , రెవెన్యూ అదనపు కలెక్టర్ డేవిడ్, గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు ఎర్రయ్య, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సేవాలాల్‌కు ఘన నివాళి



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** మండల కేంద్రంలో సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోళ్ల రవి గౌడ్, ఎంపీపీ మేకల వరలక్ష్మి, ఎంపీటీసీ అల్లిబిల్లి కృష్ణ, పేరునే ఉష రవి కురుమ, విజయ సుదర్శన్, మండల ఉపాధ్యక్షులు గుగులోతు కొమురెల్లి నాయక్, తోటకూర రమేష్, ప్రధాన కార్యదర్శి కావటి భాస్కర్, ఎస్సీ సెల్ మండల ఇంచార్జి జీడి కంటి రాజ్ కుమార్, మండల మైనార్టీ అధ్యక్షుడు ఎండీ అస్లాం, నునోవతంజయ నాయక్, శంకర్ నాయక్, పిల్లి రవి యాదవ్, శ్రవణ్ యాదవ్, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ భవన్‌లో..



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ భవన్ కేంద్ర కార్యాలయంలో సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామా రావు, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యురాలు మాలోత్ కవితమ్మ, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి, మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, మాజీ కార్పొరేషన్ చైర్మెన్ రాంచంద్రు నాయక్, రాష్ట్ర నాయకులు రూప్ సింగ్ నాయక్, కరాటే రాజు నాయక్, రాం బాల్ నాయక్, టీఎస్ జీసీసీ మాజీ చైర్మన్ దరావత్ అభిమాన్ గాంధీ నాయక్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, బంజారా కీర్తి రత్న అవార్డు గ్రహీత, రాష్ట్ర నలుములాల నుంచి రాష్ట్ర స్థాయి జిల్లా మండల స్థాయి బంజారా నాయకులు పాల్గొని విజయవంతం చేశారు.

## మల్హర్ తహశీల్దార్‌గా కుంబాల రవికుమార్



**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండల నూతన తహశీల్దార్‌గా కుంబాల రవి కుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేసిన పిప్పిరి శ్రీనివాస్ బదిలీపై మంచిర్యాల జిల్లాకు వెళ్లగా ఆయన స్థానంలో రవి కుమార్ బాధ్యతలు చేపట్టారు. మండల తహశీల్దార్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన రవి కుమార్‌కు సిబ్బంది, ప్రజా ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

## మోడీకి మద్దతుగా యువ భారతం

### ఘనంగా అభి 'నవ'భాస్కర్ జన్మదిన వేడుకలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నరేంద్ర మోడీ నాయకత్వాన్ని బలపరుస్తూ ఇటీవల బీజేపీలో చేరిన స్వర్గీయ మాజీ మంత్రి, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ప్రదాత దాస్యం ప్రణయ్ భాస్కర్ తనయుడు యువనేత కార్పొరేటర్ డా.దాస్యం అభినవ్ భాస్కర్ జన్మదినం సందర్భంగా తన అభిమానులు, బీజేపీ యువత తొలిసారి ఓరుగల్లు నగరంలో బైక్ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఈ ర్యాలీలో నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు, బీజేపీ ప్రముఖులైన ధర్మపురి అరవింద్, బీజేపీ జిల్లా, రాష్ట్ర ప్రముఖులు, కార్పొరేటర్లు, యువత, అభినవ్ యువ అభిమానులు 500 ద్విచక్ర వాహనాలు, 100కార్లతో మడికొండలోని ఈనాడు కార్యాలయం నుంచి కాజీపేట, అదాలత్, హనుమకొండ చౌరస్తా, ములుగురోడ్డు, మున్సిపాలిటీ, హంటర్ రోడ్డు మీదుగా కోడం ఫంక్షన్ హాల్ వరకు భారీ ర్యాలీని నిర్వహించి ఫంక్షన్ హాల్ లో ఘనంగా అభినవ్ భాస్కర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బంజారాల ఆరాధ్య దైవం శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి సందర్భంగా ప్రత్యేకంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎంపీ ధర్మపురి అరవింద్ మాట్లాడుతూ యువ కెరటం అభినవ్ భాస్కర్ కు అఖండ కాషాయ దళం పక్షాన జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అభినవ్ ను ఉద్దేశించి మాట్లాడుతూ మొన్ననే మోడీ నాయకత్వంలో పనిచేసేందుకు ముందుకు వచ్చి బీజేపీలో చేరిన విద్యావేత్త, నవ నాయకుడు తన తండ్రికి తగ్గ తనయుడు అభినవ్ భాస్కర్ ను దీవించాలని బీజేపీ నుంచి చాలా మంది సీనియర్లు వచ్చింద్రు, మెరికల్లాంటి యువసైన్యం నీ వెంట ఉందన్నారు. ఆ యువశక్తితో పార్టీని ఈ చారిత్రాత్మక నగరంలో మరింత బలోపేతం చేసి ఎవరికి అందనంత స్థాయికి బీజేపీ పెంచే విధంగా పనిచేయాలని ఆయన సూచించారు. సేవాలాల్ మహారాజ్ జన్మదినాన్నే మీరు జన్మించారు కనుక ఆయనలాగా అవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ జై భారత్ నినాదంతో అర్వింద్ ముగించారు. అనంతరం అభినవ్ భాస్కర్ మాట్లాడుతూ పార్లమెంట్ సమావేశాల్లో చాలా బిజీ షెడ్యూల్ ఉన్నప్పటికీ చాలా దూరం నుంచి నన్ను ఆశీర్వదించేందుకు అర్వింద్ అన్న రావడం చాలా ఆనందమని ఆయన అన్నారు. బీజేపీ దళంలో చేరిన నన్ను తమ బిడ్డలా భావించి ఆశీర్వదించేందుకు విచ్చేసిన సీనియర్ నాయకులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో చాలా మంది కార్పొరేటర్లు, సీనియర్లు తమ పార్టీలోకి అభినవ్ ను ఘనంగా ఆహ్వానిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసన సభ్యుడు సీనియర్ నాయకులు మార్తినేని ధర్మారావు, మాజీ మేయర్ రాజేశ్వర్ రావు, గుండేటి విజయ రామరావు, ఎర్రబెల్లి ప్రదీప్ రావు, పెసరు విజయ్ చంద్ రెడ్డి, డా.కాళిప్రసాద్, కార్పొరేటర్లు చాడ స్వాతి శ్రీనివాస్ రెడ్డి, శివ కుమార్, రావుల కోమల కిషన్, జలగం అనిత రంజిత్, బైరి శ్రావణ్, బీజేపీ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల కిరణ్, సిద్ధం నరేష్, యువత, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సేవాలాల్ జయంతి వేడుకలు

### భారీ ర్యాలీతో కదం తొక్కిన గోర్ బంజారాలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలో సంత్ సద్గురు సేవా లాల్ మహారాజ్ 285వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. గురువారం వేయి స్తంభాల గుడి వద్ద నుంచి శోభాయాత్ర ర్యాలీని కార్పొరేటర్ మామిండ్ల రాజుతో కలసి కాంగ్రెస్ నాయకుడు విష్ణు వర్ధన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా విష్ణు వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ బంజార చరిత్ర, సంస్కృతీ సాంప్రదాయాలు ఎంతో బాగుంటాయని, వారి పాటలు, నృత్యాలు ఎంతో అలరించాయని, కాంగ్రెస్ ప్రభుత్వంలో బంజారాలకు సముచిత స్థానం కల్పించామని తెలిపారు. సేవాలాల్ జయంతిని పురస్కరించుకొని ఇప్పటివరకు ఏ ప్రభుత్వం సెలవు ఇవ్వలేదన్నారు. మొదటిసారిగా తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగస్తులకు సెలవు మంజూరు చేసి జయంతి వేడుకలు చేసుకోండని చెప్పడం అద్భుతమైన విషయమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా గోర్ బంజారా సేవాలాల్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బాలాజీ నాయక్ మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ అనంతపురం జిల్లా గుత్తిలో జన్మించి చిన్నతనం నుంచే తన భక్తిని చాటుకుంటూ తన మహిమలతో అద్భుతాలు సృష్టించారన్నారు. బంజారాలను ఐక్యతగా ఉంచే పనిలో నిమగ్నమై అందరిని ఏకధాటిగా నిలబెట్టిన చరిత్ర సేవాలాల్ మహారాజ్ దన్నారు. గ్రేటర్ వరంగల్ లో బంజారాలకు సేవాలాల్ భవన్ ను సాధించుకొని సిటీలో ఒక లక్షకు పైగా కుటుంబాలు నివాసం ఉంటున్నారని తెలిపారు. తమకు ఒక ఫంక్షన్ హాల్ నిర్మాణంతో పాటు దేశవ్యాప్తంగా సెలవు మంజూరు చేయాలన్నారు. సీఐ కాశీరం మాట్లాడుతూ సేవాలాల్ మహారాజు జయంతిని గోర్ బంజార సంఘం వారు చాలా అద్భుతంగా చేయడం అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో బంజరాలకు ఫంక్షన్ హాల్ నిర్మాణం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మామిండ్ల రాజు, దివ్య రాణి నాయక్, సంఘం ప్రధాన కార్యదర్శి రవీందర్, కోశాధికారి గుగులోతు తిరుపతి, ఉపాధ్యక్షుడు బాలు నాయక్, సహాయ కార దర్శి గుగులోతు వినేష్, గౌరవ అధ్యక్షుడు సుందర్ నాయక్, వరంగల్ జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ నెంబర్ భూక్యా ఉషన్, జైసింఘ్ రాథోడ్, కేయూ శాఖ నేత భాస్కర్, బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలోతు నాను నాయక్, గోర్ సేన హనుమకొండ జిల్లా అధ్యక్షుడు తేజావత్ ఫణికుమార్, ఎల్ హెచ్ పీఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్, వివిధ ఉద్యోగ సంఘాలు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు .

వరంగల్ వాయిస్ సినిమా
గురువారం 15, ఫిబ్రవరి 2024


## 'మిస్టర్ బచ్చన్' నుంచి ..
# రొమాంటిక్ పోస్టర్

'మాస్ మహారాజా' రవితేజ హిట్, ఫ్లాఫ్‌లతో సంబంధం లేకుండా సినిమా మీద సినిమా చేసుకుంటూ జెట్ వేగంతో దూసుకుపోతున్నారు. రవితేజ నటించిన 'ఈగల్' సినిమా తాజాగా విడుదలై థియేటర్లలో దూసుకుపోతుంది. ఈగల్ హిట్ ఎంజాయ్ చేస్తున్న రవితేజ.. అదే ఊపులో తన తదుపరి సినిమా 'మిస్టర్ బచ్చన్' షూటింగ్‌లో బిజీ అయిపోయారు. హరీశ్ శంకర్ దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా తాజాగా కీలక షెడ్యూల్‌ని పూర్తి చేసుకుంది. నేడు 'వాలెంటైన్ డే' సందర్భంగా ఈ చిత్రం నుంచి చిత్ర యూనిట్ ఓ పోస్టర్ రిలీజ్ చేసింది.ప్రేమికుల దినోత్సవం సందర్భంగా అందరికీ శు భాకాంక్షలు తెలుపుతూ మేకర్స్ స్పెషల్ పోస్టర్ వదిలారు. రవితేజ, భాగ్యశ్రీ బోర్స్ ఒకరినొకరు ఆప్యాయంగా కౌగిలించుకున్న రొమాంటిక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అయింది. 'రవితేజ గట్టిగానే పట్టుకున్నాడే' అని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. మిస్టర్ బచ్చన్‌కు 'నామ్ తో సునా హెగా' అనేది ట్యాగ్‌లైన్. ఈ చిత్రంలో రవితేజ పూర్తి భిన్నమైన లుక్‌తో కనిపించనున్నారని, ఆయన కెరీర్‌లో 'మిస్టర్ బచ్చన్' సినిమా ప్రత్యేకంగా అవుతుందని మేకర్స్ తెలిపారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి మిక్కీజె మేయర్ సంగీతం అందిస్తున్నారు.





## ఓటీటీలోకి ..
# రొమాంటిక్ లవ్ స్టోరీ



అశోక్ సెల్వన్ హీరో గా నటించిన లేటెస్ట్ మూవీ సబా నాయగన్..ఈ మూవీలో కలర్ ఫోటో ఫేమ్ చాందిని చౌదరితో పాటు మేఘా ఆకాష్ మరియు కార్తిక మురళీధరన్ హీరోయిన్లు గా నటించారు. రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ సినిమా ప్రభాస్ సలార్ కు పోటీగా డిసెంబర్‌లో 22 న థియేటర్ల లో రిలీజై మంచి వసూళ్లను రాబట్టింది.సబా నాయగన్ మూవీ వాలెంటైన్స్ డే కానుకగా బుధవారం ఓటీటీలో రిలీజైంది. డిస్నీ ప్లస్ హాట్‌స్టార్ లో ఈ మూవీ స్ట్రీమింగ్ అవుతోంది. తమిళంతో పాటు తెలుగు, మలయాళం, కన్నడ మరియు హిందీ భాషల్లో ఈ సినిమా ను రిలీజ్ చేశారు. డిస్నీ ప్లస్ హాట్ స్టార్‌లో ట్రెండింగ్ మూవీస్‌లో ఒకటిగా సబా నాయగన్ నిలిచింది. తాగిన మత్తు లో సబా (అశోక్ సెల్వన్) అనే యువకుడు న్యూసెన్స్ క్రియేట్ చేస్తాడు. అతడిని పోలీసులు అరెస్ట్ చేస్తారు. లవ్ ఫెయిల్యూర్‌తోనే సబా పిచ్చి పిచ్చిగా ప్రవర్తించాడని పోలీస్ ఆఫీసర్ అర్థం చేసుకుంటాడు. అతడి ప్రేమకథను గురించి అడుగుతాడు. సబా జీవితంలోకి వచ్చిన రియా, మేఘ, దీప్తి ఎవరు.. అస్సలు ఈ ముగ్గురిలో సబా ఎవరిని ప్రేమించాడు అన్నదే ఈ మూవీ కథ.డిఫరెంట్ టైమ్ పీరియడ్స్‌లో సాగే లవ్ స్టోరీగా దర్శకుడు సీఎస్ కార్తికేయన్ ఈ మూవీని తెరకెక్కించాడు. థియేటర్లలో ఈ మూవీ పదిహేను కోట్లకుపైగా వసూళ్లను దక్కించుకున్నది. ఈ రొమాంటిక్ లవ్ స్టోరీని స్క్రీన్‌పై ప్రజెంట్ చేసిన తీరుతో పాటు అశోక్ సెల్వన్, మేఘాకాష్, చాందిని చౌదరి యాక్టింగ్ అభిమానులను ఎంతగానో మెప్పించాయి..కాగా సబా నాయగన్ మూవీ చాందిని చౌదరి ఫస్ట్ తమిళ్ మూవీ కావడం విశేషం. కాలేజీలో సబాను ప్రేమించే యువతిగా చాందిని చౌదరి కనిపించింది.గ్లామర్ రోల్ కాకుండా యాక్టింగ్‌కు స్కోప్ ఉన్న పాత్రను ఎంచుకొని తొలి సినిమాతోనే వైవిధ్యతను చాటుకున్నది.

# ఓజీలో ఇమ్రాన్ హష్మీ

### భాగం అయినందుకు చాలా సంతోషంగా ఉంది

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'ఓజి'. సాహో దర్శకుడు సుజిత్ తెరకెక్కిస్తున్న ఈ మూవీలో చాలా కాలం తర్వాత పవన్ కళ్యాణ్ గ్యాంగ్ స్టర్ పాత్రలో కనిపించనున్నాడు. అంతేకాదు ఈ మూవీ బ్యాక్డ్రాప్ మరియు నటీనటుల ఎంపిక వంటి చాలా విషయాలు ఎంతో ఇంట్రెస్టింగ్గా ఉన్నాయి. పవన్ కెరీర్లోనే 'ఓజి' మూవీ భారీ బడ్జెట్ తో తెరకెక్కుతుంది.అలాగే పాన్ ఇండియా మూవీగా వస్తున్న ఈ సినిమాలో బాలీవుడ్ రొమాంటిక్ హీరో ఇమ్రాన్ హష్మీ విలన్ గా నటిస్తున్న సంగతి తెలిసిందే.సల్మాన్ ఖాన్ 'టైగర్ 3'లో విలన్ గా నటించి మెప్పించిన ఇమ్రాన్ ఇప్పుడు ఓజీలో నటిస్తుండటంతో సినిమాకు మరింత బజ్ క్రియేట్ అయ్యింది. అయితే తాజాగా అతడు ఓ బాలీవుడ్ మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చాడు. ఈ సందర్భంగా ఓజీ మూవీ షూటింగ్ విశేషాలను పంచుకున్నాడు. ఈ మేరకు ఇమ్రాన్ హష్మీ మాట్లాడుతూ.. ఓజీ మూవీలో భాగం అయినందుకు చాలా సంతోషంగా ఉంది అంటూ ఈ సందర్భంగా సౌత్ ఫిలిం మేకర్స్ పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.. బాలీవుడ్ తో పోలిస్తే దక్షిణాది దర్శక-నిర్మాతలు చాలా ముందున్నారని, వాళ్లు చాలా క్రమ శిక్షణతో పనిచేస్తారని అన్నారు.అందుకే సౌత్ సినిమాలు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందుతున్నాయంటూ దక్షిణాది మూవీ మేకర్స్ పై ఇమ్రాన్ ప్రశంసలు కురిపించాడు.ఈ సందర్భంగా అతడు మాట్లాడుతూ.. "బాలీవుడ్ ఫిల్మ్ మేకర్స్ కంటే సౌత్ ఫిల్మ్ మేకర్స్ చాలా క్రమశిక్షణతో ఉంటారు. సినిమా కోసం వారు ఖర్చు చేసే ప్రతి రూపాయి తెరపై కనిపిస్తుంది. హిందీ సినిమాల్లో అలా కాదు. సినిమా కంటే కూడా నటీనటులకి ,ఇతర వాటికి ఎక్కువ ఖర్చు అవుతుంది. అలా సినిమాకు పెట్టే డబ్బు చాలా వృధా అవుతుందనేది నా అభిప్రాయం. అలాగే, వీఎఫ్ఎక్స్ వర్క్ తో పాటు పాత్ బ్రేకింగ్ కథల విషయానికి వస్తే.. దక్షిణాది చిత్రనిర్మాతలు బాలీవుడ్ కంటే ముందున్నారని చెప్పుకొచ్చారు.. ప్రస్తుతం ఇమ్రాన్ హష్మీ కామెంట్స్ ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారాయి.



# మూగబోయిన దివ్యాంగుల హక్కుల గొంతుక

### నల్లెల రాజయ్య అకాల మరణం

### నివాళులర్పించిన వివిధ సంఘాల ప్రతినిధులు



**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** నిరంతర పోరాట యోధుడు, కవి, రచయిత, దివ్యాంగుల హక్కుల గొంతుక కామ్రేడ్ నల్లెల రాజయ్య మరణం దివ్యాంగుల సమాజానికి తీరనిలోటని దివ్యాంగుల ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు బిల్ల మహేందర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఏ దివ్యాంగుడికి అన్యాయం జరిగినా నల్లెల రాజయ్య అక్కడ ప్రత్యక్షమై తన గొంతును వినిపించేవాడని అక్షరమై ప్రవహించేవాడని గుర్తు చేశారు. రాజయ్య గురువారం తెల్లవారుజామున నాలుగు గంటల ప్రాంతలో గుండెపోటుతో మృతి చెందడాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు. దివ్యాంగుల హక్కుల చట్టం-2016కు సంబంధించిన పోస్టర్లను జిల్లాలోని వివిధ పోలీస్టేషన్ లలో, ప్రభుత్వ కార్యాలయాలలో ఆవిష్కరించి అధికారులకు చట్టం గురించి తెలియజేయడంలో గొప్ప కృషి చేశాడన్నారు. దివ్యాంగ ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం, జాయింట్ యాక్షన్ కమిటి నాయకుడిగా అనేక సమస్యలపై పోరాటం చేసి వాటి పరిష్కరించడంలో సఫలమయ్యాడన్నారు. వారి అకాల మరణం దివ్యాంగుల సమాజానికి తీరనిలోటని వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తున్నమని అన్నారు. సంతాపం తెలిపిన వారిలో రాష్ట్ర కార్యదర్శి నున్న నరసమ్మ, రామకృష్ణ, బోనగిరి రాములు, ఉమ, మల్లికార్జున్ , వాసుదేవరెడ్డి ఉన్నారు.

### జన నిర్ణయం ఎడిటర్ రాజేందర్..



నల్లెల రాజయ్య అకాల మరణానికి "జన నిర్ణయం" పత్రిక శ్రద్ధాంజలి ఘటించింది. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపింది. ఆయన మరణం ప్రజాస్వామ్యాన్ని కాంక్షించే వ్యక్తులకు, శక్తులకు తీరని లోటన్నారు. అభ్యుదయ కామునిగా, పర్యావరణ రక్షకుడిగా, ప్రకృతి ప్రేమికుడిగా, కవిగా, రచయితగా, గొంతులేని జనం గొంతుకగా నల్లెల్ల రాజయ్య తన జీవిత ప్రయాణాన్ని సాగించారు. శరీర నిర్మాణంలో కొంత వైకల్యం ఉన్నప్పటికీ 'రాజన్న' భిన్నమైన వ్యక్తిత్వంతో, ధైర్యోపేతమైన కార్యాచరణతో, స్పందనకు ప్రతిరూపంగా నిలిచారని కొనియాడారు.

# కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి..

### మూడోసారి మనదే అధికారం

### బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్



**వరంగల్ వాయిస్, నర్సంపేట :** కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ముచ్చటగా మూడోసారి నరేంద్ర మోడీని ప్రధాన మంత్రి చేసే దిశగా అందరూ కృషి చేయాలని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ పిలుపునిచ్చారు. నర్సంపేటలోని బీజేపీ కార్యాలయంలో వర్ధన్నపేట నియోజకవర్గ ప్రవాస యోజన సమావేశం వరంగల్, ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల క్లస్టర్ ఇంచార్జి మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రభారి సత్యపాల్ రెడ్డితో కలిసి నిర్వహించారు. లోక్ సభ 2024 ఎన్నికల నేపథ్యంలో జరిగిన ఈ సమావేశంలో కార్యకర్తలకు, నాయకులకు గంట రవికుమార్ దిశానిర్దేశం చేశారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని అందరూ బలపర్చేలా పార్టీ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ కన్వీనర్ రేసు శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్ షా, నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి కంబంపాటి పుల్లారావు, రాష్ట్ర నాయకులు రాణా ప్రతాప్ రెడ్డి, యువత మోర్చా జిల్లా అధ్యక్షులు భరత్ వీర్, మహిళా మోర్చా అధ్యక్షురాలు కళ్యాణి, నర్సంపేట కౌన్సిలర్లు రాజు, గోల్య నాయక్, రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, డివిజన్, మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

# కట్ట మైసమ్మకు పూజలు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** బాబు జగ్జీవన్ రావ్ కాలనీలోని శ్రీ కట్ట మైసమ్మ దేవాలయాన్ని గురువారం ఉదయం మాజీ కార్పొరేటర్లు యెలుగం శ్రీనివాస్ గారు దామెర సర్వేశ్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి దీపారాధన చేశారు. పసుపు, కుంకుమల పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఓం దుర్గేశ్వరి దేవి ఉత్సవ మండలి అధ్యక్షులు కటకం విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ అంతరాయం కలుగొద్దు

### బల్దియా ఇంచార్జి కమిషనర్ రాధిక గుప్తా

### పోలీస్, జీడబ్ల్యూఎంసీ అధికారులతో సమన్వయ సమావేశం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** మేడారం జాతరకు వెళ్ళే భక్తులకు నగరంలో ట్రాఫిక్ సమస్య కలుగకుండా ఏర్పాట్లు చేయాలని బల్దియా ఇంచార్జి కమిషనర్ రాధిక గుప్తా అధికారులను ఆదేశించారు. గురువారం హనుమకొండలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో పోలీస్, బల్దియా అధికారులతో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో సెంట్రన్ జోన్ డీసీపీ అబ్దుల్ బారీ, ట్రైనీ ఐపీఎస్ పండరీ చేతన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాత్కాలిక బస్ స్టాండ్ల వద్ద తగినంత లైటింగ్ తో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, మహా నగర పరిధిలోని రోడ్లపై గుంతలు లేకుండా వెంటనే మరమ్మతులు చేయాలని, డ్రైన్స్ లకు కవర్ చేయాలని, పారిశుద్ధ్య నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణకు సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓ రమేష్, ట్రాఫిక్ ఏసీపీ భోజరాజు, ఇన్స్పెక్టర్లు సుజాత, శ్రీధర్, సీతా రెడ్డి, బల్దియ డీసీపీ ప్రకాష్ రెడ్డి, ఈఈ సంజయ్ కుమార్, ఏసీపీలు ఖలీల్, శ్రీనివాస్ రెడ్డితో పాటు డీఈలు రవికుమార్, రవి కిరణ్, ఏఈ హరి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### తాగు నీరు వృథా చేస్తే చర్యలు..

తాగు నీరు వృథా చేస్తే చర్యలు తప్పవని బల్దియా ఇంచార్జి కమిషనర్ రాధిక గుప్తా హెచ్చరించారు. గురువారం బల్దియా పరిధిని గోపాలపూర్ క్రాస్ రోడ్, ద్వారక సాయి కాలనీ, రేణుకా ఎల్లమ్మ కాలనీ, కాకతీయ యూనివర్సిటీ ఫిల్టర్ బెడ్, లార్డ్ వృద్ధాశ్రమం తదితర ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించి నీటి సరఫరా, శానిటేషన్ స్థితిగతులను పరిశీలించి సమర్థవంతంగా చేపట్టుటకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సిరంగి సునీల్ కుమార్, సీఎంహెచ్ ఓ డాక్టర్ రాజేష్, ఈఈ రాజయ్య, డీఈ రవికుమార్, సానిటరీ సూపర్ వైజర్ నరేందర్, సానిటరీ ఇన్స్పెక్టర్లు భీమయ్య, భాషా నాయక్, ఏఈ రాగి శ్రీకాంత్, ఆర్ ఐ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమ కారుల సంక్షేమానికి కృషి

### ఫోరమ్ చైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ ఆధ్వర్యంలో గురువారం ప్రెస్ క్లబ్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉద్యమ కారుల కృతజ్ఞత సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ప్రతి ఉద్యమ కారుడికి 250 గజాల స్థలం, అర్హతను బట్టి ఉద్యోగం, ఉద్యమ కేసులు ఎత్తివేత, అతి తక్కువ వడ్డీకి రుణాలు, పెన్షన్ అందించేందుకు కృత నిశ్చయంతో ఉన్నారన్నారు. అయితే తెలంగాణ ఉద్యమ కారులను గుర్తించేందకు కమిటీని నియమించాలని, ఉద్యమ కారుల సంక్షేమ బోర్డు, ఉద్యమ కారుల భవన్ ఏర్పాటు చేయాలని, ఉద్యమ కారులకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రేవంత్ రెడ్డికి ఉద్యమ కారుల బాధలు తెలుసన్నారు. కాబట్టి అన్ని రకాలుగా ఆదుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కేసీఆర్ ఉద్యమ కారులకు ద్రోహం చేశారని మండిపడ్డారు. ఉద్యమ కారులకు జరిగిన అన్యాయంపై మీ ఊరికొచ్చే బీఆర్ ఎస్ నాయకులను నిలదియాలన్నారు. ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ ఉద్యమ నాయకుడు చిర్ర రాజు, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు రవీందర్, భూపాలపల్లి అధ్యక్షుడు గట్టన్నా, ములుగు రాజు, వరంగల్ రఫీఉన్నిసా అజిజ్, పాలకుర్తి ప్రభాకర్, వర్ధన్నపేట రమేష్, పరకాల కిరిటీ, ఘనపూర్ మహేందర్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు జ్యోతిరెడ్డి, వివిధ జిల్లాల ఉద్యమ కారులు, నాయకులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ రాజ్యసభ అభ్యర్థిగా వద్దిరాజు



### పార్టీ నేతలతో కలిసి నామినేషన్ దాఖలు

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** బీఆర్ఎస్ రాజ్యసభ అభ్యర్థిగా వద్దిరాజు రవిచంద్రను పార్టీ చీఫ్ కేసీఆర్ ప్రకటించిన నేపథ్యంలో గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నేతలతో కలసి అసెంబ్లీ ప్రాంగణంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకున్న ఆయన తన నామినేషన్ ను ఎన్నికల అధికారికి అందించారు. ఈ సందర్భంగా మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరితోపాటు సహచర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తదితరులు రవిచంద్రకు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com